క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



రుద్రూర్: మండలంలోని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందచేశారు. ఫుడ్ ఇండస్ట్రీ కామధేను సీఈవో వెంకటేశం, వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి పవన్ చంద్రారెడ్డి, డీన్ వెంకట్ రెడ్డి, హిందుధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



పెర్కిట్(ఆర్మూర్): ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఐకేపీ అడిషనల్ డీఆర్డీవో మధుసూదన్ సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై డివిజన్‌లోని ఏపీఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు వారి ఖతాల్లో జమా అయ్యేలా చూడాలన్నారు. డీపీఎం మోహన్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ




బోధన్: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు గురువారం విద్యుత్ శాఖ అధికారులు భూమి పూజ చేశారు. విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్వామి, ఏడీఈ తోట రాజశేఖర్, ఏఈ సుమిత, బోధన్ ఏడీఈ నగేష్ కుమార్, ఏఈ కళ్యాణ్, సుందర్‌రాజ్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శన



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్‌లో నిర్మిస్తున్న వేయి నామాల వెంకటేశ్వర ఆలయంతోపాటు దేగాంలోని లక్ష్మీనారాయణ ఆలయం, మిర్దాపల్లిలోని భవానిశంకరాలయాలను గురువారం టీటీడీ అధికారులు సందర్శించారు. ఆయా ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి టీటీడీ పాలక మండలి వారిని ఉత్తరం ద్వారా కోరారు. దీంతో పాలకమండలి ఆదేశాల మేరకు గురువారం స్థపతులు, ఇంజినర్లు ఆలయాలను సందర్శించి వ్యయాలను అంచనా వేశారు. అంచనా వ్యయాలను పాలక మండలి వారికి తెలియజేయనన్నట్లు వారు తెలిపారు.

వరి పక్వానికి వచ్చిన తర్వాతే కోయాలి



రుద్రూర్: వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోయాలని పోతంగల్, కోటగిరి ఏవోలు రాజు, నిశిత సూచించారు. కోటగిరి తహసీల్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ గంగాధర్ సమక్షంలో హార్వెస్టర్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కోత మిషన్ ఉపయోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం



బోధన్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవార రాత్రి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని లీడ్ ఇండియా ఫౌండేషన్, ట్రస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) అధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో సాలూర ప్రజ్ఞశ్రీ హైస్కూల్ కరస్పాండెంట్ మిద్దెల రాజు, పట్టణ అధ్యక్షుడు హరిక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి మంతేష్ సురేష్ అవార్డులు అందుకున్నారు. లీడ్ ఇండియా ఆర్గనైజర్ సుదర్శన్‌జీ, ప్రోగ్రాం చైర్మన్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నష్టాలను మిగిల్చిన వరి సాగు

- ఖరీఫ్‌లో తగ్గిన పంట దిగుబడి
- వరుసగా వర్షాలు, తెగుళ్లే కారణం
- లబోదిబోమంటున్న రైతులు



వర్నిలో ధాన్యాన్ని తూకం వేస్తున్న కూలీలు

వర్ని/బోధన్‌రూరల్ : ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించిన వరి పంట దిగుబడి తగ్గింది. ప్రతి ఏడాది కంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 15 క్వింటాళ్ల దిగుబడి తగ్గడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస వర్షాలు, అగ్గి తెగులు, బ్యాక్టీరియా తెగుళ్ల మూలంగా దిగుబడి తగ్గినట్టు రైతులు పేర్కొంటున్నారు. ఎకరానికి 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సింది కేవలం 25 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందంటున్నారు. ఎకరానికి సుమారు రూ.30వేల పెట్టుబడి కాగా ఖర్చుల వరకు కూడా ఆదాయం రాకపోగా, పెట్టుబడితో పాటు ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్టం వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతు పరిస్థితి మరి దారుణంగా తయారైంది. పెట్టుబడితోపాటు రూ.10వేల నష్టం రాగా రైతుకు కౌలు ఎలా చెల్లించాలని కౌలుదారులు ప్రశ్నిస్తున్నారు.

దళారులకే విక్రయం..

బోధన్ నియోజకవర్గంలోని నవీపేట, బోధన్, రెంజల్, ఎడపల్లి మండలాల్లో లక్ష 10 వేల ఎకరాల్లో ఈ వానాకాలం సీజన్‌లో రైతులు పంటలను సాగు చేయగా అత్యధికంగా సుమారు 90 వేల ఎకరాలకు పైగా వరి పంటనే సాగు చేశారు. ఉమ్మడి వర్ని మండలంలో సుమారు 28 వేల ఎకరాల్లో సాగయింది. పంట కోతలు ప్రారంభం కాగా, ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లపై దృష్టిసారించడం లేదు. దీంతో చాలా ప్రాంతాల్లో వరి పంటను కోసిన రైతులు ఎక్కువగా దళారులకే ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ-గ్రేడ్ రూ.2389, బీ-గ్రేడ్ 2369లు ఉండగా ప్రైవేటు వ్యాపారులు రైతుల వద్ద రూ.2,000 నుంచి 2100 వరకు మాత్రమే కొంటున్నారు. వాతవారణం సైతం ఇబ్బందికరంగా ఉండటంతో రైతులు చేసేదేమి లేక తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్మేస్తున్నారు. పంట దిగుబడి తగ్గడంతోపాటు, దళారులు తక్కువ ధరకే పంటను కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అమాంతం తగ్గిపోయింది..



మా కుటుంబమంతా కలిసి సొంతంగా ఉన్న 4 ఎకరాలతోపాటు రూ.40వేల ధరతో 13 ఎకరాలు కౌలు తీసుకుని వరి పంటను సాగు చేశాం. కానీ అధిక వర్షాలు, చీడపీడల బెడదతో దిగుబడి అమాంతం పడిపోయింది. ఎకరాకు 35 బస్తాలు మించి పంట రాలేదు. దీంతో పెట్టిన పెట్టుబడి, కౌలు పైసలు రాక తీవ్రంగా నష్టపోతున్నాం.

–అరుణ, మహిళ రైతు, బర్దిపూర్, బోధన్ మండలం

ఎప్పుడూ ఇలా జరగలేదు..



ఈ ఏడాది దిగుబడి తగ్గినట్లు గతంలో ఎప్పుడూ జరగలేదు. అధిక వర్షాల మూలంగా భారీగా దిగుబడి తగ్గింది. పెట్టుబడితో పాటు మరో పదివేలు ఎకరానికి నష్టపోవడంతో కౌలు చెల్లించడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పొలం యజమానులు పరిస్థితిని అర్థం చేసుకొని కౌలు విషయంలో కౌలు దారునికి సహకరించాలి.

–పల్సర్ కృష్ణ, కౌలు రైతు, కూనిపూర్ క్యాంపు

వర్షాలతో తగ్గిన దిగుబడి



వరుస వర్షాల మూలంగా ఈ ఖరీఫ్ సీజన్లో వరి దిగుబడి తగ్గింది. నెల రోజుల పాటు వరుసగా వర్షాలు కురవడంతో వరి పంట నీట మునగడం. నీరు అధికం కావడం వల్ల అగ్గి తెగులు, తేమకంకి, నల్ల పురుగు, బ్యాక్టీరియా, ఎండు తెగులు ఆశించడంతో గింజ నిండుదల తగ్గడంతో పంట దిగుబడి తగ్గింది.

–రాజశేఖర్, ఉమ్మడి వర్ని మండల వ్యవసాయ అధికారి

వీధిలో కుక్కలు.. ఇళ్లపై కోతులు



గ్రామంలోని వీధి కుక్కలు



ఇళ్లపై వానరం

- పిల్లలు, పెద్దలపై వరుసగా దాడులు
- బయటకు రావాలంటే జంకుతున్న దత్తాపూర్ ప్రజలు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని దత్తాపూర్ గ్రామంలో వీధుల్లో కుక్కలు, ఇళ్లపై కోతులు సంచారం ఎక్కువైపోయింది. దీంతోపాటు పిల్లలు, పెద్దలపై విచక్షణ రహితంగా దాడులు చేస్తున్నాయి. భయం గుప్పిట్లో ఉన్న గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటనే జంకుతున్నారు. అయినా సమస్యను అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఇటీవల ఓ వృద్ధురాలిపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో ఆస్పత్రికి తరలించారు. అలాగే గుడికి వెళ్తున్న పదేళ్ల బాలుడిని వీధి కుక్కలు వెంబడించి కరిచాయి. కాలుకు తీవ్రగాయం కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శివాజీ చౌరస్తా వద్ద కిరాణాషాపులోకి వెళ్లిన మహిళపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తాజాగా గురువారం గ్రామ పంచాయతీ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న రాజేశ్ అనే వ్యక్తిపై వానర మంద దాడి చేశాయి. దీంతో ఆయనకు రెండు చోట్ల తీవ్ర గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. గడిచిన కొన్ని రోజుల్లోనే కోతులు, కుక్కల దాడులు పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గేదెలు, దూడలపై కూడా దాడులు చేసి చంపుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వానరాలు, వీధి కుక్కలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోతులు తీవ్రంగా దాడి చేశాయి..

ఇటీవల రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా నాపై పది, పదిహేను కోతులు దాడికి వచ్చాయి. గట్టిగా అరిచి తేరుకునే లోపు నన్ను తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు వెంటనే నన్ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. జరుగుతున్న వరుస సంఘటనలతో ప్రజలు భయపడుతున్నారు. –రాజేశ్, బాధితుడు

నా కొడుకుని గాయపరిచాయి..

గ్రామంలో ఎక్కడ చూసి నా కోతులు, కుక్కలు గుంపులుగా కనిపిస్తున్నాయి. భయంతో ప్రజలు ఇళ్ల నుంచి రావడం లేదు. నా కొడుకును వీధి కుక్కలు ఇటీవల గాయపరిచాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కలు, వానరాలను ఇక్కడి నుంచి వెంటనే తరలించాలి. –శ్రీకాంత్, గ్రామస్తుడు

రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయాలి



నందిపేటలో బంద్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు



బోధలో బంద్‌కు సహకరించాలని ప్రజలను కోరుతున్న బీసీ సంఘాల జేఏసీ ప్రతినిధులు

నందిపేట్/బోధన్‌టౌన్/బోధన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 18న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు వారు నందిపేటలోని నందిగుడి ప్రాంగణంలో పోస్టర్లను ఆవిష్కరించారు. బోధన్‌లో దుకాణాలు, హోటళ్లకు తిరుగుతూ బంద్‌కు సహకరించాలని బీసీ సంఘాల నేతలు కోరారు. బోధన్‌లో నిర్వహించిన సమావేశంలో రాజకీయ పార్టీలు, వామపక్ష విద్యార్థి సంఘాల జేఏసీ ప్రతినిధులు బంద్‌కు మద్దతు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా సంఘాలు, పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మాక్లూర్: జిల్లా కేంద్రంలోని ఆఫీసర్ క్లబ్‌లో జరిగిన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ అండర్ 19 పోటీలు జరిగాయి. ఇందులో మండలంలోని దాస్‌నగర్ వద్దగల మహాత్మజ్యోతిబాపూలే విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగ విద్యార్థినులు మహేశ్వరీ, అక్షయ, ప్రశాంతి, స్పందనను పీడీ నీరజ, పావణి, ప్రిన్సిపాల్ మరియాల స్వప్న అభినందించారు.

జిల్లా, జోనల్ స్థాయి పోటీలకు..

బాల్కొండ : మండలంలోని కిషన్ నగర్ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 ఖోఖో బాల్కొండ జోనల్, జిల్లాస్థాయి బాలుర, బాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈసందర్భంగా ముప్కాల్ క్రీడల అధికారి ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన జట్లను త్వరలో జరగనున్న జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని, అక్కడ ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు.

రుద్రూర్: మండల కేంద్రంలోని రుద్రూర్ బాలుర పాఠశాలలో జోనల్ స్థాయి అంతర పాఠశాలల క్రీడల్లో పాల్గొనే జట్లను గురువారం ఎంపిక చేశారు. కోటగిరి జోనల్ (రుద్రూర్, పోతంగల్, కోటగిరి) స్థాయి అండర్-14, అండర్-17 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో జట్లను ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

పెర్కిట(ఆర్మూర్): జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన అండర్-17 ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్పందన, విజ్ఞత రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ మధు గురువారం తెలిపారు. ఆర్మూర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని హిమతేజ సైతం పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

బాల్కొండ: గ్రామాల్లో భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియ అన్నారు. ముప్కాల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వారు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి వారు సూచించారు. తహసీల్దార్ ముంతాజ్బొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ వసంత్ రావు, ఆర్ఐ రాఘవేంద్రరావు, రవి, అంజలి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- గంజాయి, అవినీతిపై ఉక్కుపాదం వేస్తాం
- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్: పట్టణంలో రూ.47 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ నిధులతో పట్టణంలో రోడ్ల సమస్యను పరిష్కరించాలన్నారు. గంజాయి లాంటి అసాంఘిక శక్తులను అరికట్టేందులు అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. దీపావళి టపాకాయల దుకాణాల ఏర్పాటు విషయంలో కొందరు అక్రమార్కులు కలగజేసుకొని షెడ్ల వేలం నిర్వహించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి యువత ఉద్యమించాలి

ఆర్మూర్: విద్యారంగంతోపాటు వివిధ రంగాల్లో సమస్యల పరిష్కారానికి యువత, యువ మోర్చా ప్రతినిధులు ఉద్యమించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువార ఆయన భారతీయ జనతా యువమోర్చా నాయకులతో మాట్లాడారు. అనంతరం ఆర్మూర్ పట్టణ యువ మోర్చా అధ్యక్షుడిగా ఉదయ్‌గౌడ్‌కు నియామకప పత్రాన్ని అందజేశారు. మందుల బాలు, పాల్కం వేణు, జెస్సు అనిల్, సుంకరి రంగన్న, ఆకుల రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి





మదన్‌పల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది.. జలాల్‌పూర్ గ్రామంలో..

మాక్లూర్/బాల్కొండ/వేల్పూర్/పెర్కిట్(ఆర్మూర్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పాడి రైతులకు పశువైద్యాధికారులు సూచించారు. మాక్లూర్, బాల్కొండ, వేల్పూర్, ఆర్మూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటువ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. మాక్లూర్ మండలం మదన్‌పల్లిలో వైద్యాధికారులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమా సహేర్ పశువులకు టీకాలు వేశారు. బాల్కొండ మండలం జలాల్ పూర్‌లో, ఆర్మూర్ మండలం పెర్కిట్‌లో టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ టెక్నికల్ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధరయ్య పరిశీలించారు.

వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి టీకాలు వేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల నిలువు దోపిడీని అరికట్టాలి



ఆర్మూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఆర్మూర్: దేశాయ్ బీడీ ఫ్యాక్టరీ కార్మికుల నిలువు దోపిడీని యాజమాన్యం నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ, టీయూసీఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్మూర్‌లో గురువారం టీయూసీఐ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫ్యాక్టరీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యాజమాన్యం వెయ్యి బీడీలకు రూ. పది తక్కువ ఇస్తూ కార్మికులను నష్టాలపాలు చేస్తున్నారన్నారు. వీటితోపాటు పితారా పేరు తినుబండారాలను తప్పనిసరిగా కొనుగోలు చేయాలని కార్మికులను బలవంతం చేయడం సరైంది కాదన్నారు. అనంతరం యాజమాన్య ప్రతినిధికి వినతిపత్రాన్ని సమర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు గురువారం మండల కేంద్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ నాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు.



ఉన్నత స్థాయికి ఎదగాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రముఖ రచయిత సంధ్య విప్లవ్, సినీ నటి రోహిణి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్ 44వ వార్షికోత్సవ వేడుకలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. అనంతరం వారిని విజయ్ విద్యాసంస్థల అధినేత్రి అమృతలత సన్మానించారు. కవితా దివాకర్, రమాదేవి, కిరణ్ బాల, వసంత, ప్రభ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఆస్పత్రికి ఆపరేషన్ టేబుల్స్..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి గురువారం ఐడీబీఐ బ్యాంక్ సహకారంతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద డెలవరీ ఆపరేషన్ థియేటర్‌కు సంబంధించిన రెండు ఆపరేషన్ టేబుల్స్ అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీస్ శ్రీనివాస్ ప్రసాద్, రీజనల్ మేనేజర్ శ్రీషరావురావు, బ్యాంక్ మేనేజర్ అరవింద్ ఉన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన-2025కి ఎంపికైందని పాఠశాల హెచ్ఎం, ఎంఈవో జక్కుల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 18 నుంచి 23 వరకు భోపాల్ పట్టణం, మధ్య ప్రదేశ్‌లో జాతీయ స్థాయిలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా గైడ్ టీచర్ మల్లెష్, గ్రూపు లీడర్ అంకితలను అభినందించారు.

కిసాన్‌నగర్‌లో ఫిజియోథెరపీ శిబిరం

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ భవిత కేంద్రంలో గురువారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ అఖిల, ఎంఈవో రాజేశ్వర్ మాట్లాడుతూ.. ప్రతి మంగళ, గురువారాల్లో శిబిరం ఉంటుందన్నారు. ఐఈఆర్పీ రాజానర్సయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

కమ్మర్‌పల్లి(భీమ్‌గల్): భీమ్‌గల్‌కు చెందిన భూక్య మహిపాల్‌కు వైద్య చికిత్స కోసం గురువారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈసందర్భంగా సునీల్‌రెడ్డికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు..

నందిపేట్(ఆర్మూర్): మండంలోని మాయాపూర్ గ్రామానికి చెందిన దూద రమేష్ అనే బాధితుడికి గురువారం రూ.52వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మంద మహిపాల్, వెంకటేష్, ముత్యం, భోజన్న, ఒంకార్, జీవన్, గంగాదర్ పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతి

నవీపేట: గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేయవద్దని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది కోరారు. వారు గురువారం ఎంఈఓ అశోక్‌కు వినతి పత్రం సమర్పించారు.

సీపీఆర్‌పై అవగాహన

నవీపేట: మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. మెడికల్ ఆఫీసర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

వేల్పూర్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వేల్పూర్ ఎస్సై సంజీవ్ సూచించారు. మండలంలోని పచ్చలనడ్కుడ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం రమేష్ కుమార్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

బోధన్‌రూరల్: మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు శంకర్, వీరేష్ పాల్గొన్నారు.

ఆరో తరగతి విద్యార్థి అదృశ్యం



నవీపేట: మండలంలోని సిరన్‌పల్లి గ్రామానికి చెందిన ఎత్తారి సాయికుమార్ (13) అనే విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి గురువారం తెలిపారు. జన్నేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న సాయికుమార్ బుధవారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేయగా ఎలాంటి ఆచూకీ లభించలేదన్నారు. విద్యార్థి పెద్దమ్మ ఎత్తారి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు

మాక్లూర్/బోధన్/కమ్మర్‌పల్లి/వేల్పూర్: రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలని అధికారులు, కాంగ్రెస్ నాయకులు సూచించారు. మాక్లూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ నాయకుడు బూరోల్ల అశోక్ స్థానిక నేతలు, రైతులతో కలిసి వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సాలూరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ అల్లె జనార్దన్ ప్రారంభించారు. హున్సా సొసైటీలో బోధన్ ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, సొసైటీ చైర్మన్ మందర్నా రవి న్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వేల్పూర్‌లో డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్, నర్సాపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని, అమీర్‌నగర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ప్రారంభించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో గురువారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. సుమారు 65 క్వింటల్లా బియ్యంను పట్టుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పజెప్పినట్లు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.